క్లుప్తంగా

అయ్యప్ప భక్తులకు అన్నదానం



కృష్ణమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం రూరల్: మండలంలోని నికరంపల్లి గ్రామంలో అయ్యప్పస్వాములకు మధ్యాహ్న అన్నదాన కార్యక్రమాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు మాజీ వైస్ ఎంపీపీ కుందురు కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకల్లా అన్నదానం గొప్పదని అన్నారు. కార్యక్రమంలో తిరుమల రెడ్డి జయరామిరెడ్డి, బోరు శ్రీనివాసరెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



అక్కచెరువు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. పొదిలి మండలంలోని అక్కచెరువు,తుమ్మగుంట పంచాయతీలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముదుగా ప్రధాని సందేశాన్ని వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చేరెడ్డి నాగలక్ష్మి, అంబవరపు తిరుపతి రెడ్డి, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, సీడీపీఓ సుధామారుతి, ఏఓ జైన్‌లాబ్దిన్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో వాసవి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రంగయ్య

మార్కాపురం టౌన్: ఒంగోలులో శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆచార్య దేవోభవ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వాసవీ విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ రంగయ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో పదో తరగతి విద్యార్థిని ఆర్.లాస్యవల్లి మొదటి స్థానంతోపాటు మరో నలుగురు బహుమతులు గెలుపొందారని వివరించారు. విద్యార్థులను డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ డి.సీతారామయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం మండలంలోని డీలర్లకు మండల పౌరసరఫరాల వినియోగదారుల స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రేషన్ బియ్యం పంపిణీపై ఎండీయూల పనితీరుపై చర్చించారు. లబ్ధిదారులకు రేషన్ ఎలాంటి అవకతవకలు జరగకుండా నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని సూచించారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షునిగా నరసింహారావు



మాలకొండ నరసింహారావు



ఊటుకూరి రామకృష్ణ

మార్కాపురం: పట్టణంలోని గుండ్లకమ్మ నది తీరాన వెలసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడిగా చక్కా మాలకొండ నరసింహారావును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన 2003 నుంచి దేవస్థానం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. దేవస్థానం అభివృద్ధి, నూతన కల్యాణ మండపం నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. గౌరవ అధ్యక్షునిగాఆర్‌కేజీ నరసింహారావు, కార్యదర్శిగా ఊటుకూరి రామకృష్ణ, కోశాధికారిగా పాదర్తి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడల పోటీలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం

గిద్దలూరు రూరల్: ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలకు రిజిస్ట్రేషన్ సోమవారం నుంచి ప్రారంభమైనట్లు స్థానిక ఎంపీడీఓ హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 15 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు సమీపంలోని సచివాలయంలో వలంటీర్ల ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ విధానం డిసెంబర్ 13వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. పూర్తి వివరాల కోసం దగ్గరలోని సచివాలయం సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి



కేదారేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దంపతులు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

మార్కాపురం టౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక జగదాంబసమేత మార్కండేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. శివలింగం, జగదాంబ అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి రుద్రాభిషేకం, కుంకుమార్చన చేశారు. ఆలయ చైర్మన్ కేశవశర్మ, ఈవో చెన్నకేశవరెడ్డి, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉభయదాతల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కేదారేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

తర్లుపాడు: కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని కేతగుడిపిలో కేదారేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మార్కాపురం, తర్లుపాడు మండలాలతోపాటుగా చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆయన సతీమణి కల్పనతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. సచివాలయం కన్వీనర్ మల్లారెడ్డి శివభక్తులకు ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అర్చకులు రామూశర్మ, రాఘవశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. సర్పంచ్ పెద్దమస్తాన్ విద్యా కమిటీ చైర్మన్ సీహెచ్ రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ పొల్యూషన్ బోర్డు మెంబర్ వెన్నా హనుమారెడ్డి, ఆయన సతీమణి తర్లుపాడు జెడ్పీటీసీ ఇందిరతో కలిసి కేదారేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ఆయన సతీమణి లీలావతితో కలిసి పూజల్లో పాల్గొన్నారు.

మార్కాపురం: కార్తీక పౌర్ణమి సందర్భంగా కంభం రోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక పౌర్ణమిలో భాగంగా భక్తులకు ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ బాంబే వారి 54వ వార్షికోత్సవం సందర్భంగా సుమారు 400 మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గోపిశెట్టి కొండయ్య, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, కొనకనమిట్ల, రేగడపల్లి, పెదారికట్ల, ఎదురాళ్లపాడు, చినారికట్ల, బ్రాహ్మణపల్లి, సలనూతల, అంబాపురం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు కొత్తపట్నం, జమ్ములపాలెం, శ్రీశైలం, భైరవకోన, రామతీర్థం ఆలయాలకు తరలివెళ్లారు.

గిద్దలూరు రూరల్: కార్తీక పౌర్ణమి సోమవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయం, కొండపై శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఆవరణలోని గిరిజానాథస్వామి ఆలయం, కేఎస్ పల్లెలో సమీపం భీమలింగేశ్వరస్వామి ఆలయం, ముండ్లపాడు భవానీశంకర ఆలయం, పాపులవీడు క్షేత్రాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి వారి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కొండపై శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఆవరణలో కోటిదీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు అల్పాహారం అందజేశారు.

కొమరోలు: మండలంలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మండలంలోని పామూరుపల్లె సమీపంలో వెలసిన సాంబసదా శివాలయం, గోపాలునిపల్లె గ్రామంలో వెలసిన త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారు జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో శివునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

పెద్దదోర్నాల: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసిద్ధి గాంచిన శ్రీశైల పుణ్యక్షేత్రాన్నికి భక్తులు భారీగా తరలి వెళ్లారు. దీంతో మండల కేంద్రంలో రద్దీ వాతావరణం నెలకొంది. మండల కేంద్రంలోని పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరాలయం, అయ్యప్ప స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చెన్న మల్లేశ్వరస్వామికి అభిషేకం, రుద్రాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు, మణి స్వామిల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

త్రిపురాంతకం: కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీ పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, శ్రీబాలాత్రిపురసుందరీదేవి అమ్మ వారి ఆలయాలకు భారీగా భక్తులు తరలి వచ్చారు. భక్తులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయాల వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు విశ్వనారాయణశాస్త్రి, ప్రసాదశర్మ భక్తులచే జరిపించారు. స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. అమ్మవారి ఆలయంలో భక్తులు కుంకుమార్చనలు చేశారు. భక్తుల ఏర్పాట్లు ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి పర్యవేక్షించారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సామాజిక సత్రాల వద్ద వన భోజనాలు చేశారు. శ్రీపంచలింగాల పీఠం వద్ద త్రిపుర అన్నదాన సేవ సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కురిచేడు: కార్తీక పౌర్ణమి, సోమవారం కలిసి రావటంతో శివాలయానికి భక్తుల తాకిడి పోటెత్తింది. శ్రీజ్ఞానప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి వేకువ జాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహాలకు, నాగమయ్యపడిగలకు, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబకు కుంకుమార్చనలు, శ్రీ కాళహస్తీశ్వరస్వామికి అభిషేకాలను ఆలయ పూజారులు కురిచేటి సుబ్బారావు పూజలు, అభిషేకాలు చేయించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయానికి భక్తులు వచ్చి పూజలు చేశారు.

దర్శి: శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి, సోమవారం కలిసి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో దీపాలు వెలిగించి స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది.



గొట్లగట్టులో పూజలు చేస్తున్న మహిళలు



ముండ్లమూరు: ఈదర శివాలయంలో..

పొదిలి: స్థానిక నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజల్లో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, సతీమణి నారాయణమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్వాలా తోరణంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఉడుముల తదితరులకు అర్చకులు ఆహ్వానం పలికి పట్టు వస్త్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నేతలు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, నూర్జహాన్, ఆరోగ్యశ్రీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఉడుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ గీతికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు హరిహర నామ స్మరణతో మార్మోగాయి. భక్తులు, మహిళ, మాల ధరించిన స్వాములు మండలంలోని ఈదర, పులిపాడు, ఉమామహేశ్వరపురం, మారెళ్ల, పోలవరం, పసుపుగల్లు, పెదరావిపాడు, ముండ్లమూరు గ్రామాల్లోని శివాలయాలను వేకువ జాము నుంచే భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక దీపాలంకరణతో దీపోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక కాశీ విశ్వేశ్వర ఆలయంలో సోమవారం దేదీప్యమానంగా జ్వాలా తోరణాన్ని వెలిగించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు రెంటచింతల శ్రీరామచంద్రమూర్తి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి సుబ్బారావు జ్వాల తోరణాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



గిద్దలూరు: భీమలింగేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

వీఆర్వో మౌనికకు ఘన నివాళి

కొనకనమిట్ల: శ్రీకాకుళం పట్టణం రైతు బజారు సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న బి.మౌనిక రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. బ్రెయిన్‌డెడ్ అయిన మౌనిక అవయవాలను కుటుంబ సభ్యులు పెద్దమనసుతో దానం చేసి ఐదుగురికి ప్రాణం పోయడం గొప్ప విషయమని కొనకనమిట్ల తహశీల్దార్ సాజిదా పేర్కొన్నారు. మౌనిక చిత్రపటానికి కారాలయ సిబ్బంది పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

దీక్షిత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

అర్ధవీడు (కంభం): దీక్షిత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 30న మండలంలోని బొల్లుపల్లిలో మొదలై అర్ధవీడు, అయ్యవారిపల్లి, బోగోలు, వెలగలపాయ, రంగాపురం, మాగుటూరు మీదుగా డిసెంబర్ 7వ తేదీన నాగులవరంలో కార్యక్రమం పూర్తవుతుందని, కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఆతార్ నాయబ్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీని వెంటనే తొలగించాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ ఖాజీ నాయబ్‌రసూల్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ పట్టణంలోని ముస్లిం పెద్దలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఖాజీ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని డిటీ సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ముస్లిం పెద్దలు గుడిసె బాష, మౌలాలీ, లథీఫ్ ఖాన్, సుభానీ పాల్గొన్నారు.

గుంటిగంగ ఈఓగా కార్తీక్



ఈఓగా బాధ్యతలు చేపడుతున్న కార్తీక్

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటిగంగా ఆలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పి.కార్తీక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఈఓగా ఏవీ భాస్కరరెడ్డి పని చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్తీక్‌ను ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు.

సిమెంట్ లారీ బోల్తా



పొలంలో బోల్తాపడిన లారీ

కొమరోలు: అదుపుతప్పి సిమెంట్ లారీ అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇడమకల్లు గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మాచర్ల నుంచి గుత్తికి సిమెంటు లోడ్‌తో వెళుతున్న లారీ ఇడమకల్లు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి పంటపొలాల్లో బోల్తాపడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

యర్రగొండపాలెంలో మంత్రి సురేష్ పర్యటన నేడు

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం యర్రగొండపాలెం రానున్నారని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ తెలిపారు. సామాజిక కార్యకర్త జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలవేసి నివాళులర్పిస్తారని, అనంతరం రంగన్నపాలెంలో 220/132/33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా చేసే శంకుస్థాపన చేస్తారని, ఈ సందర్భంగా రంగన్నపాలెంలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని ఆయన తెలిపారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ



రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం రైతు భరోసా కేంద్రాన్ని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సోమవారం తనిఖీ చేశారు. గ్రామ రైతులకు రైతు విత్తన పథకం గురించి అవగాహన కలిగించారు. వరి పంటలోని వివిధ రకాల చీడపీడలు గురించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు డి.హారిక, రైతులు పాల్గొన్నారు.

దొండ పందిర్లలో యాజమాన్యం పాటించాలి

కురిచేడు: దొండ పందిర్లలో కాక్సినియం మిడ్ అధికంగా ఉందని, యాజమాన్యం పాటించాలని ఉద్యానవనశాఖాధికారి డి.సంధ్య సూచించారు. మండలంలోని బోధనంపాడు గ్రామంలోని దొండ పందిర్లు, టమోట, మిరప పంటలను ఆమె సోమవారం పరిశీలించారు. దొండ పందిరలో కాక్సినియం మిడ్ అధికంగా ఉండటంతో కొమ్మతీగ ఎండిపోవటం, కాయచిన్నవిగా ఉండి పసుబారి రాలిపోతున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంటు కె. అనూరాధ, రైతులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలు వినియోగించుకోవాలి

- వైఎస్సార్ కేపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్



లబ్ధిదారులకు సూచనలిస్తున్న పీడీ రవికుమార్

తాళ్లూరు (ముండ్లమూరు): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ కేపీ ప్రాజెక్టు డైరెక్టర్ టి.రవికుమార్ అన్నారు. మండలంలోని మన్నేపల్లి పంచాయతీ పరిధి దారంవారిపాలెం గ్రామానికి చెందిన గోగుల జయమ్మ 13 లక్షల 84 వేలతో నూతనంగా ఏర్పాటు చేసిన బేకరి యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి పథకం వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశక్తి మహిళలను ప్రోత్సహించేందుకు బ్యాంకులు తమ సహాయ సహకారాలు అందజేస్తున్నాయని తెలిపారు. మూడు లక్షల ఉన్నతి పథకం, పది లక్షల 80 వేలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా తూర్పుగంగవరం బ్రాంచి వారు రుణం మంజూరు చేయగా 35 శాతం రాయితీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పీఎంఎఫ్ ఎంఈ పథకం ద్వారా వ్యాపారంపై ఆశక్తి ప్రతి ఒక్కరికీ రెండు లక్షల పైన పెట్టుబడి పొందిన వారికి 35 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఎలాంటి వ్యాపారాలు చేసుకోవాలన్నా అన్ని వర్గాల వారికి ఈ అవకాశం ఉందని చెప్పారు. నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. మీతో పాటు మరి కొంత మందికి ఇలాంటి యూనిట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వైఎస్సార్ కేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు డేవిడ్, శ్రీనివాసప్రసాద్, సుబ్బారావు, దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, ఏపీఎం దేవరాజ్, సీసీలు పాల్గొన్నారు.

పెయ్యదూడల ఉత్పత్తి పథకంతో మేలు



మినరల్ మిక్చర్ పంపిణీ చేస్తున్న డాక్టర్ కాలేషా

దర్శి (కురిచేడు): పెయ్యదూడల ఉత్పత్తి పథకంతో పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పశుసంవర్ధక శాఖ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కాలేషా తెలిపారు. మండలంలోని బొట్లపాలెంలో పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారాకృత్రిమ గర్భధారణ చేసి పెయ్యదూడలను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. దీని వాస్తవ విలువ రూ.1350 కాగా ప్రభుత్వం రూ.850 రాయితీకి ఇస్తుందని, పశుపోషకులు కేవలం రూ.500 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 25 మంది పాడిరైతులతో అంగికార పత్రం తీసుకున్నారు. 25 పశువులకు డీ వార్మింగ్ మందులు, మినరల్ మిక్చర్ కిలో వంతున పంపిణీ చేశారు. పశువైద్యాధికారి బసవయ్య, ఏహెచ్ఏలు, పాడిరైతులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాయవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం డెంటల్ ఫ్లోరోసిస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫ్లోరోసిస్ నివారణ అధికారి డాక్టర్ అనిల్ మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి నెక్ బెల్టులు, రబ్బర్ బెల్టులు, హ్యాండ్ స్టిక్స్, స్టాండ్, వినికిడి పరికరాలు పంపిణీ చేసేందుకు పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో జరిగిన సదస్సుల్లో పరికరాల కోసం నమోదు చేసుకున్న వారికి వీల్‌చైర్లు, హ్యాండ్ స్టిక్స్ అందజేశామన్నారు. కార్యక్రమంలో గజ్జలకొండ మెడికల్ ఆఫీసర్ పి. సుమిత, హెల్త్ విజిటర్ విమల, ఏఎన్ఎంలు విశ్రాంతమ్మ, హెప్సిబా, నానీ, సంధ్య, ఆదిలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

70 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న వెన్నా హనుమారెడ్డి

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం వీహెచ్ఆర్ విద్యా సంస్థలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 70 మంది విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమని హనుమారెడ్డి పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, జిల్లా వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానాన్ని హనుమారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర, గాయం శ్రీనివాసరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్సై

పొదిలి: వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూముల వ్యవహారం కోర్టులో ఉందని, తుది తీర్పు రావాల్సి ఉందని తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సై వెంకట సైదులుతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆక్రమణలు జరుగుతున్నాయని సమాచారం అందటంతో, తాము వెళ్లి హెచ్చరికలు చేసినట్లు తెలిపారు. వక్ఫ్ భూముల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని ఆక్రమణకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించి ఉన్నతాధికారుల కమిటీ తీసుకునే నిర్ణయాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు.

రెడ్‌క్రాస్ సొసైటీ బలోపేతానికి కృషి

దర్శి (కురిచేడు): దర్శిలో రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేసి కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ మెంబర్ కపురం శ్రీనివాసరెడ్డి తెలిపారు. దర్శి సబ్ బ్రాంచికి 9 మందితో కమిటీని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీకి సొంత భవనం ఏర్పాటు గురించి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కోరినట్లు చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.